క్లుప్తంగా

నేడు పెద్దింటమ్మ అమ్మవారి పండగ



పండగ చాటింపులో పాల్గొన్న గ్రామ పెద్దలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధిలో కొలువు దీరిన పెద్దింటమ్మ అమ్మవారి పండగ గురువారం నిర్వహించనున్నారు. ఈ పండగ చాటింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం గ్రామం పెద్దల సమక్షంలో చేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ అమ్మవారి పండగను ఏటా అంగ రంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. పండగలో మల్కాపురం ప్రజలంతా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని పెద్దలు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాపురం: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు.. కంచరపాలెం ప్రాంతానికి చెందిన మల్లేశ్వరరావు (32) కంచరపాలెంలో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీన సొంత పనుల నిమిత్తం ఆటోలో వెళ్తుండగా ఆటో మారుతీ సర్కిల్ వైపుగా కాన్వెంట్‌కు వెళ్లాల్సి ఉంది. మార్గ మధ్యలో మారుతీ సర్కిల్ వద్ద గల మలుపు వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మల్లేశ్వరరావు తలకు తీవ్ర గాయమైంది. దీంతో అపస్మారక స్థితికి చేరడంతో చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికురాలి తొలగింపు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో ఏళ్ల నుంచి తిష్టవేసి, నిర్వాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఒప్పంద కార్మికురాలిని విశాఖ జాయింట్ కలెక్టర్ తొలగించారు. ఎస్డీసీ కార్యాలయంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి, దందాలు చేసే బ్రోకర్లకు పెద్ద పీట వేస్తూ, నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని ఇటీవల సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన అధికారుల నివేదిక మేరకు రాజేశ్వరిని విధుల నుంచి తొలగించారని రామ అప్పారావు పేర్కొన్నారు.

ప్రజా ప్రతినిధుల తీరు బాధాకరం



దీక్షా శిబిరంలో కార్మిక సంఘ నాయకులు

అగనంపూడి: సార్వత్రిక ఎన్నికల తరువాత ఎన్నికైన ప్రజా ప్రతినిధుల తీరు బాధాకరంగా ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఎస్.రామారావు, శ్రీనివాస నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి 1252వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రకటనలకే పరిమితం కావడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. కేంద్ర మంత్రి రెండు మాసాల్లో ఉక్కుకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, ఉత్పత్తికి కావల్సిన వనరులు కల్పిస్తామని ప్రకటించారని, కానీ ఆ దిశగా కనీసం అడుగులు పడకపోవడంతో వారిలో ఆందోళన అధికమవుతోందన్నారు. ఈ పరిణామాల వల్ల విశాఖ ఉక్కు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. నాయకులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, శ్రీనివాస్, నరసింగరావు, వై.ఎల్.నాయుడు, మోహిద్దీన్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలు

వారంతా నిరుపేద కుటుంబానికి చెందిన బాల,బాలికలు. అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పించడంతో చదువులో రాణించారు. అలాంటి వారి భవితకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ట్రిపుల్‌ఐటీలు దివిటీలుగా నిలిచాయి. వారిని అక్కున చేర్చుకున్నాయి. ఉన్నత ఆశయాలతో ఆ ఆణిముత్యాలు ట్రిపుల్‌ఐటీల్లో అడుగుపెడుతున్నారు. ఉన్నతంగా స్థిరపడతామని ధీమాగా చెబుతున్నారు.

- 'పశ్చిమ' నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటీకి 12 మంది ఎంపిక
- ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు
- పేదరికం అయినా ఉన్నత లక్ష్యం వైపు అడుగులు



మల్కాపురం: ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువులను ఉచితంగా అందించేందుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి గొప్ప ఆశయంతో ట్రిపుల్ ఐటీలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వీటిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ పూర్తి చేసిన వారు మంచి ప్యాకేజీలతో మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ, కృష్ణాజిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా ఒంగోలు, శ్రీకాకుళంలో ఈ ట్రిపుల్ ఐటీలున్నాయి. నాలుగు కేంద్రాల్లో మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులు సాధించిన వారికి 92.99 శాతం, ప్రైవేటు పాఠశాలల్లో చదివి బీపీఎల్‌కు దిగువన ఉన్నవారికి 7.01 సీట్లు కేటాయిస్తున్నారు. ట్రిపుల్‌ఐటీలు ప్రారంభించినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రవేశాలు లభిస్తున్నాయి.పశ్చిమ నియోజకవర్గంలో 12 మంది ట్రిపుల్‌ఐటీల్లో సీట్లు సాధించారు.

సైంటిస్టు అవుతా..



ఈ చిత్రంలో ఉన్న బాలుడు అల్లు జశ్వంత్. మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివాడు. 600 గాను 588 మార్కులు వచ్చాయి. జిల్లాలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన వారిలో జశ్వంత్ మూడో వాడు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జశ్వంత్ బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందుకున్నాడు.జశ్వంత్ తండ్రి చిన్నయ్యనాయుడు గోల్డు షాపులో మేనేజర్‌గా పని చేస్తున్నారు.తల్లి జగదేశ్వరి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. పదిలో ఉత్తమ మార్కులు సాధించడంతో నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు పొందాడు. ఇస్రోలో సైంటిస్టు కావాలన్నదే తన లక్ష్యమని జశ్వంత్ చెబుతున్నాడు.

బ్యాంకు ఉద్యోగం సాధిస్తా..



ఈ చిత్రంలో ఉన్న బాలిక పేరు వై.కనక యశస్విని. 63వ వార్డు చింతల్లో వద్ద గల ఆదర్శ రాయల్ విద్యాలయంలో పదో తరగతి చదివింది. 600 మార్కులకు గానూ 570 మార్కులు సాధించింది. యశస్విని చదువుతో పాటు స్కౌట్స్ ద్వారా ఆపదలో ఉన్న వారికి సాయం అందించడం వంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనేది. తండ్రి కనకరాజు యశస్వినికి ఏడాదిన్నర వయసులోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.అప్పటి నుంచి తల్లి శ్రీదేవి పిల్లల బాధ్యత తీసుకుంది.తల్లి శ్రీదేవి ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. యశస్వినికి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. బ్యాంక్ ఉద్యోగం చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.

ఫ్యాషన్ డిజైనింగ్ నా డ్రీమ్



నేను జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాను. 573 మార్కులు సాధించాను. నాన్న తారకేశ్వరరావు మల్కాపురం మార్కెట్‌లో చిన్న పాన్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాది అద్దె ఇల్లు. తల్లి దీపారాణి గృహిణి. అక్క షర్మిల నూజివీడులో ట్రిపుల్ ఐటీ చేసింది. నాకు శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది.చదువులో సందేహాలను అక్కతో పాటు పాఠశాలలో ఉపాధ్యాయులు తీర్చడంతో అత్యధిక మార్కులు వచ్చాయి. పెద్ద ఫ్యాషన్ డిజైనర్ కావాలన్నదే తన కల అని చెప్పింది.

– హర్షిత, జీవీఎంసీ ఉన్నత పాఠశాల, మల్కాపురం

పేరుతెచ్చుకుంటా....



గోపాలపట్నం ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివాను. తండ్రి లేడు. మా అమ్మ సంరక్షణలో పెరిగాను. అమ్మ చిన్నచిన్న పనులు చేస్తూ చదివించింది. మా పాఠశాలలో మంచి సౌకర్యాలు ఉండడంతో పాటు ఉపాధ్యాయులు బాగా పాఠాలు చెప్పారు.మంచి మార్కులు రావడంతో ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. మంచి పేరు తెచ్చుకుని అమ్మ రుణం తీర్చుకుంటాను.

– నంద గణేష్, గోపాలపట్నం

అమ్మానాన్నల కష్టాలు తీరుస్తా..



అమ్మానాన్నల కష్టాలు తీరుస్తాను. నాన్న జగన్నాథం తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అమ్మ గృహిణి. యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పదోతరగతి చదువుకున్నాను. ఉపాధ్యాయుల బోధన, వారి సూచనలు నాకు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చేందుకు దోహద పడ్డాయి. ఇంజినీరింగ్‌లో పరిశోధనాత్మక విద్యపై ఆసక్తి ఉంది. అందుకోసం కృషి చేస్తాను.

– జి.గౌతమ్ యల్లపువాని పాలెం

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తొలి ఏకాదశి సందర్భంగా ఆయా ఆలయాల్లో కొలువు దీరిన శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామిలకు ఆలయ అర్చకులు పూజలు చేశారు.

- జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాధవవీధిలోని శ్రీకృష్ణుడి మందిరంలో నిర్వహించిన పూజల్లో మల్కాపురం,వెంకన్నపాలెం ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. విష్ణు సహస్ర నామార్చన ,లలిత పారాయణ వంటివి పఠించారు.
- ఐవోసీ వద్ద గల చింతామణి దుర్గాగణపతి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి,శ్రీహరిపురంలోని హరిహర క్షేత్రంలో కొలువు దీరిన వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆలయాల్లో ఏకాదశి పూజలు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా విశేష పూజలు, అర్చనలు చేశారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలోని రామాలయం, శివాలయం, ప్రశాంతినగర్ సాయిబాబా ఆలయం, కొత్తపాలెం శివాలయం, ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా అభిషేకాలు చేశారు.



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

డీసీపీ-2 తుహిన్ సిన్హా బాధ్యతల స్వీకరణ

అక్కిరెడ్డిపాలెం: డీసీపీ-2 తుహిన్ సిన్హా గాజువాక పోలీస్ స్టేషన్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. గంజాయిని రవాణా చేసినా, తరలించినా కఠిన చర్యలు తప్పవన్నారు. గంజాయి, డ్రగ్స్ సరఫరాకు సంబంధించి పాఠశాలలు, కాలేజీలపై నిఘా పెడతామన్నారు. గంజాయి రవాణా రైడ్స్‌లో పట్టుబడితే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి, వారిలో పరివర్తన తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ జిల్లాలో పనిచేసే సమయంలో గంజాయి రవాణా, వినియోగాన్ని 90 శాతం నియంత్రించామని చెప్పారు. సిన్హాకు గాజువాక సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, క్రైం ఏసీపీ శ్యామలరావు, గాజువాక లా అండర్ ఆర్డర్ సీఐ ఎం.శ్రీనివాసరావు, క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు.



డీసీపీ- 2 తుహిన్ సిన్హా

డీసీపీకి అభినందనలు

ఉక్కునగరం: డీసీపీ తుహిన్ సిన్హాను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా సిన్హా మాట్లాడుతూ ప్లాంట్‌లో శాంతిభద్రతల సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా బదిలీపై అమరావతి వెళ్తున్న డీసీపీ మోకా సత్తిబాబును వారు సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్.మోహన్‌బాబు, అంజిబాబు, సాయి ప్రసాద్, జె.వి.రావు, బి. అరవిందకుమార్ పాల్గొన్నారు.

ఏయూ వీసీగా దళితుడికి అవకాశమివ్వాలి

సీతమ్మధార: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్(వీసీ)గా దళిత వర్గానికి చెందిన వ్యక్తికి అవకాశమివ్వాలని దళిత హక్కుల పోరాట సమితి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ డిమాండ్ చేసింది. రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ ఏయూ వీసీ రాజీనామాను గవర్నర్ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు కలిగిన ఎందరో ప్రతిభావంతులు, శాస్త్రవేత్తలను తీర్చిదిద్దిన ఘనత ఆంధ్ర యూనివర్సిటీకి ఉందన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ లాంటి గొప్ప వ్యక్తులను ఏయూ తయారు చేసిందని గుర్తు చేశారు. యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ వేయాలన్నారు. 25 ఏళ్లుగా ఓసీ, బీసీలకు చెందిన వారే వీసీలుగా ఉన్నారని, ఈ సారి దళితులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోరాట సమితి నాయకులు

45 కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వివరాలిలా.. రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా, ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. కోల్‌కతాకు చెందిన జునైద్, ఎం.డి.ఇమ్రాన్, బెంగళూరుకు చెందిన మహ్మద్ కలీద్‌లు బెంగళూరులోని విక్టోరియా హాస్పిటల్లో పనిచేస్తున్నారు. వీరు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి బెంగుళూరుకు తరలించే క్రమంలో విశాఖ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. విచారణ అనంతరం ఈ ముగ్గురిని ఫోర్త్‌టౌన్ పోలీసులకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు. వీరి వద్ద నుంచి 45 కిలోల గంజాయి, రెండు సూట్‌కేస్‌లు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళా ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేశారు.

చీటీల నిర్వాహకులకు కౌన్సెలింగ్

సీపీ ఆదేశాలతో పోలీసుల చర్యలు

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు అన్ని స్టేషన్లలో చీటీల నిర్వాహకులను పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ చేస్తున్నారు. గతంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడంతో బాధితులు స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తెలిసిందే. రోజువారీ కూలీలు, ఇతర వృత్తిదారులు తమ పిల్లల చదువులు, వివాహాలు వంటి అవసరాల నిమిత్తం చీటీలు వేస్తుంటారు. దసరా, సంక్రాంతి, వరలక్ష్మీ వ్రతం వంటి నగదు చీటీలు కడుతుంటారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు విశాఖకు వలస వచ్చి చిన్న చిన్న పనులు, వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని చీటీల రూపంలో పొదుపు చేసుకుంటున్నారు. వీరి బలహీనతను ఆసరాగా తీసుకుని కొందరు చీటీ నిర్వాహకులు అర్ధాంతరంగా బిచాణా ఎత్తేయడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

ముందు జాగ్రత్త చర్య..

ప్రభుత్వ లైసెన్స్ లేని చీటీ నిర్వాహకులంతా చీటీలు వేయకుండా ముందు జాగ్రత్త చర్యగా అన్ని స్టేషన్లకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని సమాచారం. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా అటు ద్వారకా జోన్.. ఇటు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లలో చీటీల నిర్వాహకుల తాకిడి కనిపిస్తోంది. పోలీసులు వీరికి రోజూ కౌన్సెలింగ్ చేస్తున్నారు. ప్రతి నెలా ఎక్కడో ఒక చోట చీటీల నిర్వాహకులు బోర్డు తిప్పేయడం ఆనవాయితీగా మారిపోయింది. పలు ప్రైవేట్ సంస్థలు ప్రభుత్వ లైసెన్స్ తీసుకున్న తరువాతే చీటీలు నిర్వహిస్తుంటారు. కానీ నివాసాల మధ్య కొందరు చీటీల నిర్వాహకులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే దర్జాగా చీటీపాటలు వేస్తూ.. అమాయక ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారింది.



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్

మోసపోవద్దు.. మేల్కొండి

ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, దొండపర్తి, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో చీటీల నిర్వాహకులు ఎక్కువగా ఉన్నారని సమాచారం. ఎవరైనా చీటీల నిర్వాహకులు పాటదారులకు వెంటనే సొమ్ములు చెల్లించాలని, లేనిపక్షంలో చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు నిర్వాహకులను హెచ్చరిస్తున్నారు. నగర సీపీ ముందు జాగ్రత్త చర్యగా చీటీల నిర్వాహకులను మొదట్లోనే కట్టడి చేస్తే మోసాలకు ఆస్కారం లేకుండా చేయొచ్చని యోచిస్తున్నారు. ప్రభుత్వ లైసెన్స్ లేని వ్యక్తుల వద్ద చీటీలు వేసి మోసపోవద్దని ప్రజలకు పోలీసులు సూచిస్తున్నారు. చీటీలు వేసి మోసపోయిన తరువాత తమను ఆశ్రయించడం కన్నా.. ముందే మేల్కోవాలని పోలీసులు హితవు పలుకుతున్నారు.

జీతాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన

మధురవాడ: క్లాప్ వాహనాల లోడింగ్ కార్మికులకు బకాయిపడిన 6 నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు డిమాండ్ చేశారు. జీవీఎంసీలో క్లాప్ వాహనాలకు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్మికులకు జీతాలు ఇవ్వకుండా పని చేయించుకోవడం అన్యాయమన్నారు. బుధవారం మధురవాడ జోన్ – 2 పరిధిలోని 5, 6, 7, 8 వార్డులకు చెందిన కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. మధురవాడ కృష్ణానగర్‌లో గల ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఒప్పంద కార్మికులకు నెలకు రూ.13,500 ఇస్తామని చెప్పినా 6 నెలలుగా చెల్లించకుండా చాకిరీ చేయించుకుంటున్నారన్నారు. జీతాలు అందక కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. కార్మికులకు కనీసం హ్యాండ్ గ్లౌజెస్ కూడా ఇవ్వకపోవడంతో పురుగులు పట్టిన చెత్తను చేతులతోనే ఎత్తుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోడర్స్ గ్లౌజ్‌లు, మాస్కులు, హ్యాండ్ వాష్ లిక్విడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఎమ్‌హెచ్‌వో కిషోర్‌ని కలిసి సమస్యలు వివరించారు. వారం రోజుల్లో జీతాలు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, టి.వెంకటరమణ, కె.లక్ష్మి, వై.రమణ, లక్ష్మినరసింహ, డి.రాము, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



మధురవాడలో ఆందోళన చేస్తున్న కార్మికులు

సింహగిరి.. భక్త ఝరి



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి పూజలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7గంటలకు స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ తులసీదళాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం నేత్రపర్వంగా సాగింది. మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేట కాలనీలో మంగళవారం రాత్రి మధుమిత ఘోష్ అనే వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌కు చెందిన మధుమితకు అదే ప్రాంతానికి చెందిన టింకూ కుమార్ ఘోష్ అలియాస్ రాజేష్‌తో 2019లో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. వీరు 9 మాసాల క్రితం తగరపువలస వచ్చారు. టింకూ కుమార్ స్థానిక దుకాణంలో పని చేస్తున్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్ధల కారణంగా మాటలు లేవు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్య, కుమార్తె ఇంట్లో నిద్రించగా టింకూ కుమార్ హాలులో టీవీ చూస్తూ నిద్రపోయాడు. బుధవారం ఉదయం టింకూ కుమార్ లోపలికి వెళ్లి చూడగా భార్య ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. మధురవాడ జోన్ ఏసీపీ సునీల్, భీమిలి సీఐ డి.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ గంటా హరీష్ సంఘటన స్థలానికి చేరుకుని మధుమిత మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

ఇద్దరికి స్వల్ప గాయాలు

అగనంపూడి: గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న కారు స్టీరింగ్ లాక్ కావడంతో డివైడర్ పైకి దూసుకుపోయిన సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. దువ్వాడ పోలీ స్టేషన్ పరిధి వడ్లపూడి వంతెనపై జరిగిన సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గాజువాకకు చెందిన మోహన్, ధనలక్ష్మి వదిన, మరిదులు. వారితో పాటు మరో ఇద్దరు కారులో అనకాపల్లి వెళ్తుండగా శ్రీనగర్ దాటిన తరువాత వడ్లపూడి వంతెనపై కారు స్టీరింగ్ పట్టేయడంతో కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. డివైడర్‌పైనున్న చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ సంఘటనలో మోహన్, ధనలక్ష్మిలకు స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కారును పోలీస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



డివైడర్ పైకి దూసుకుపోయిన కారు

జీవో 21ని తక్షణమే రద్దు చేయాలి

మద్దిలపాలెం: వాహనదారులపై జరినామాలు విధించే జీవో నంబర్ 21ని తక్షణమే రద్దు చేయాలని ఆటో యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఆటో డ్రైవర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నియంత్రణ పేరుతో అధిక జరిమానాలు విధిస్తూ వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీవో 21ని రద్దు చేయాల్సిన అవసరముందన్నారు. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు.సమావేశంలో అడ్డూరి శంకర్, లంక గోవింద్ పాల్గొన్నారు.

యువకుడి మృతి

అగనంపూడి: ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు మూర్ఛవ్యాధితో పాటు గుండెపోటు కారణంగా మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దువ్వాడ సీఐ ఎర్రం నాయుడు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం ఒడిగి సమీపంలోని సురాయ్‌పూర్ గ్రామానికి చెందిన గణేష్ కుమార్ విశ్వకర్మ (23) ఉపాధి కోసం నెల రోజుల క్రితం అగనంపూడి వచ్చాడు. గణేష్ కుమార్ మిత్రులు అగనంపూడి గళ్లవానిపాలెంలో అన్నపూర్ణ వాషింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గణేష్‌కుమార్‌ను కూడా ఇదే పనిలో చేర్పించారు. దీంతో వారితో కలిసి నివాసముంటున్నాడు. బుధవారం రాత్రి మోటార్ సైకిల్ కడుగుతుండగా, మూర్ఛ వచ్చి పడిపోవడంతో గణేష్ మిత్రులు వెంటనే సమీపంలోని అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మూర్ఛతో పాటు గుండెపోటు రావడంతో మృతి చెందాడని ధ్రువీకరించారు. సంఘటనా స్థలానికి సీఐ ఎర్రం నాయుడు చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.



గణేష్ కుమార్ మృతదేహం